

# అయిందా శాస్తి

శ్రీ బాలకృష్ణరావు.

రాత్రి తొమ్మిది కావచ్చింది. చీకటీ, నిశ్శబ్దతా, ఒకదాన్నొకటి మించి పరిపాలిస్తున్నాయి ఆ వీధిని.

“అమ్మా, మాదాకబళంపెట్టండమ్మా!” అని ఒక యాచనా పూర్వకమైన కేక. ఆ యాచనలోని విధేయతా, ఆ కంఠధ్వనిలోని దైన్యం, ఆ హృదయంలోని బాధను బయటపెడుతున్నాయి. సన్నంగా, నీరసంగావున్న అకేకవింటే, జాలికలిగి, ‘అయ్యో, పాపం’ అనిపిస్తుంది, ఎంతటివాళ్ళకేనా.

అలా, యింటింటికీ, ఓకేకవేస్తూ. ఏయింట్లోంచి ఆయినా, ఏయిల్లాలయినా, ‘ఆగమ్మీ’ అని ఆదరణతో అంటుందేమో అని శరీరమంతా చెవులు చేసుకుని వింటూ నెమ్మదిగా సాగిపోతూంది. పాపం, ఆ బిచ్చగత్తె, అంత పేపటివరకూ, వూరంతా తిరిగినా, ఆ బీదపొట్టలోని ఆకలిచిచ్చును ఆర్పడానికి తగినంత అన్నం దొరకలేదు కామోసు!

రాజవీధి కాక, కొంచెం యిరుకైనది అవడంవల్ల, ఆ సందులో అప్పుడే జనసంచారం చాలా మట్టుకు తగ్గింది.

ఆ సందులో ఒక యిల్లు—దాని అరుగు మీద ఒకగది—ఆ గదిలో మంచంమీద పడుకున్న ఒక యువకుడు పత్రిక కాబోలు చదువుకుంటున్నాడు. ‘టేబిల్’ మీదనుంచి లాంతరు కిరణాలు కిటికీగుండా ‘రోడ్డు’ మీదకు ప్రసరిస్తున్నాయి. అతనికి మధ్య మధ్య కునుకువస్తూంది. ఛదువుతూన్న పత్రిక అప్పుడప్పుడు అతనికి తెలియకుండానే గుండెలమీద వాలుతూంది.

రోడ్డుమీదపోతున్న ఆ బిచ్చగత్తె అతణ్ణి చూచింది. అతనికీ, ఆమెకూ ఎన్నో విషయాల్లో ఎంతో భేదం కనిపించింది—

మీరు భాగ్యవంతులూ, మేము బీదలమూనా? ఏమిటీతేడా?, ఎందుకుండాలే అసలీభేదం? వారినీ, మమ్మల్నీ ఒకరేకాదూ సృష్టిస్తా? మాకు మాత్రం హృదయంలేదూ? ఆశలూ, అపేక్షలూ, మాకు మాత్రంలేవూ? మా ఆశలన్నీ అడియాసలయిపోవలసిందేనా! వారు యిట్లాంటి యిళ్ళల్లో సుఖంగా కాపరంచేస్తూంటే, మేము, దీపకళికకు కూడా నోచిపుట్టని చుట్టుగుడిశెలలో పాతుకుపోవలసిందేనా? వారలా అన్నివిధాలా సుఖజీవనం చేస్తోంటే—మేము ఆజన్మాంతం అడుక్కుతింటూ, కాలం గడపవలసినదేనా? ఆసుఖానికీ—ఆ భాగ్యానికీ, వారుచేసుకున్న ‘పుణ్యం’ ఏమిటీ! యీ కష్టాలకీ—యీ దరిద్రానికీ, మేము చేసుకున్న ‘కర్మం’ ఏమిటీ?—ఏమిటీ ‘సృష్టికర్త’ చేసే అన్యాయ్యం? ఏమిటీ సంఘంచూపే నిరాదరణ?”

—యిల్లాంటి సందేహాలు, ఎన్నో కలిగాయి ఆ దరిద్రపీడిత హృదయంలో.—పాపం! ఆబీద మెదలోనిరొద ఎవరికి వినిపిస్తుంది? ఎవరికి తెలుస్తుంది! అంతా నిష్ప్రయోజనం.

ఆ సమయంలో, ఆమెకు భాగ్యవంతులంటే అసూయ.—భాగ్యంఅంటే రోత—కలిగింది. భాగ్యాన్నీ. భాగ్యవంతుల్నీ ఎంతో తిట్టింది—ఎన్నోశాపనాకారాలు పెట్టింది, యింకా ఆవుక్కురోషం ఆగలేదు.

ఆతని సౌఖ్యాన్ని చూసి సహించ లేకపోయింది. ఎందుచేతో, ఆ ప్రత్యేకవ్యక్తి మీద, ఈర్ష్య, కోపం, పగ, కలిగేయి క్రమంగా ఆమెకు—అకారణంగానే!

అసలే ఆకలిమంట—దానికితోడు ఈర్ష్యాగ్ని-పైగా క్రోధానలం—మూడూ కలిసి దహించేస్తున్నాయి, ఆ హృదయాన్ని, ఒళ్ళు మరిచిపోయింది ఆ వుద్రేకంలో.

కిటికీగుండా గదిలోకిచూచింది. అతను నిద్రావస్థలోవున్నాడు, ఎదురుగుండా, గోడకు వేలాడుతూన్న ‘గ్లాసుగోషర్టు’—దాని జేబులోంచి తొంగిచూస్తూన్న ‘మనీపర్సు’—అప్పుడే ఆహృదయంలో ఒక ఊహ మొలకెత్తింది. ఆ ఊహను ఆశపురిగొల్పింది. దానికి, అతను నిద్రపోతూండడం—ఆవీధిలో ఎక్కడా రస్తాలేకపోవడం—లోపల గడియేనా లేకుండా తలుపు జార్లాలేసివుండడం—మొదలైన అప్పటి పరిస్థితులు ‘హుషారు’ యిచ్చేయి.

“అంతపనేనా!” అని అదమాయించింది, అంతరాత్మ, ఆ అదమాయింపుకు లొంగిపోయింది, ఆమె.

ఆకలతలతోనే ఆవీధిచిగురికివెళ్ళి, వెనక్కుమరలింది. మళ్ళీ ఆయింటిని సమీపించింది. మరోసారి గదిలోకిచూచింది. గాఢంగా నిద్రపోతున్నాడతను.

నెమ్మదిగా అరుగెక్కింది గది గుమ్మాన్ని సమీపించింది. మళ్లీ అంతరాత్మ మేలుకుని వాదించడం మొదలెట్టింది ఆమెతో,

“ఆ! ఎంత తప్పుపని చేస్తున్నావ్.”

“చేయకపోతే ఎలా మరీ? యింటిదగ్గర కుర్రాడిస్థితి జ్ఞాపకంతెచ్చుకో. తెలుస్తుంది”!

“అయితే మాత్రం!”

“మరి, వాడికీ నాకూ యీరాత్రిగడిచే దెల్లా?”

“గడవకేం? యింతకన్నా ఘోరమైన రాత్రులు—కాళరాత్రులు—ఎన్ని గడిచిపోలేదు, యిదివరకు?—అదీగాక. యిదివరకు ఎప్పుడూ చెప్పుకోని ఈదారుణాన్ని, యివ్వాళ, యింత ధైర్యంగా........”

“చప్. ఊరుకో! ఎప్పుడూ యిలాగ పిరికిమందుపోస్తూండడమే నీ పని” అని హుంకరించి ఊరుకోబెట్టింది, అమాయకపు అంతరాత్మని.

ఓరువాకిలిగా జార్లేసివున్న తలుపును నెమ్మదిగా గెంటింది—ఒణుకుతూన్న చేతులతో,

టిక్కుటిక్కుమంటూన్న గడియారం తప్పితే, ఆ గదిలోని నిశ్శబ్దతకు అంతరాయం కలిగించేది మరోటేమీలేదు, అక్కడ. నెమ్మదిగా చొక్కాను సమీపించింది. వొణుకుతూన్న హస్తాన్ని చాపింది పర్సుకోసం—

—ఆ పర్సును తీసే తొందరలో ఆ జేబులోనే వున్న కలము ఊడి, కిందవున్న ట్రంకుపెట్టిమీద ‘ఠకీలు’ మని పడింది. ఆ కర్కశధ్వనికి ఆమె ఎంతో బాధపడింది; హృదయంమీద ఉవ్వెత్తుగా గొడ్డలిపడినట్లనిపించిం దామెకు.

అంతవరకూవున్న నిశ్శబ్దత అంతరించింది—అతనికి మెలుకువవచ్చింది—తలెత్తిచూచేడు—దానితో ఆ దరిద్రమూర్తి ఆపాదమస్తకం ఒక్కసారి గజగజ కంపించి కృంగిపోయింది.

గభీలుమని లేచేడు తాచుపాములాగ. మూలనున్న పేకబెత్తంతీసి, “ఏయ్, ఎవరునువ్వూ? అని గర్జిస్తూ సమీపించాడు.

“ఆ! ఆ! బాబూ, క్షమించండి బాబూ, దీనురాలిని, ఆకలితో చచ్చిపోతున్నాను” అన్నది పాపం లేవబోతూ—కాని, మీదపడబోతూన్న పేకబెత్తాన్ని తట్టుకోవడానికి ప్రయత్నించడంలో తూలి, మళ్లీ పడిపోయింది.

“ఆ! ఏమిటీ, ముష్టిముండా” అన్న ఉరుములు—వెనువెంటనే ‘పెడేల్ పెడేల్’మని పేకబెత్తపు పిడుగులు—తక్షణమే “అయ్యబాబోయ్ చచ్చేను” అన్న యెలుగులు—ఆ యింటి కప్పును ఎగరకొట్టేయి, ఒక్కసారి.

“చావుముండా, దరిద్రం వొదులుతుంది” అంటూ, అరుగుకిందకు నెట్టేశాడు, ఆ బాలుడు ఆమెను!

“ఆకలిట! ఆకలి!! డబ్బుకామోసు—ఆకలి తీర్చేది!!!” అని ఒగురుస్తూ తలుపు బిడాయించుకున్నాడు.

పడిపోయిన కాస్సేపటికి తేరుకుంది. చుట్టూ చీకటిమయం. లేవబోయి మళ్ళీ పడిపోయింది. ఒళ్ళంతా నొప్పులు, మోచేతులూ, మోకాళ్లూ గీసుకుపోయేయి, భుజాలమీదా, వీపుమీదా, పేకబెత్తెపుతట్లు! రక్తం చిమ్ముతున్నాయి. తల దిమ్మెక్కిపోయింది.

ఆక్షణాన్నే ఆమెలోని మానవత్వం మాయమైంది. యిప్పుడు ఆమె చూట్టానికి మాత్రం మనిషిలావుంది; కాని. మానవస్వభావాలు ఆమెలో లేవు. ఆమె ఉనికిమాత్రం యీ ప్రపంచంలో అయినా, ఆమె దంతా “మరోప్రపంచం.”—

ఎలాగో—నెమ్మదిగా లేచింది మూల్గుతూ.—“అయిందా శాస్త్రి ముష్టిముండా” అన్న ఉరుము మళ్లీ వినిపించింది—గదిలోంచి—గభీలుమని లేచింది—ఎక్కడనుంచి వచ్చిందో, ఆ పిచ్చి బలం—కిటికీ దగ్గరకువెళ్ళి “అహ్హాహ్హా” అని అట్టహాసంచేసింది. ఉలిక్కిపడ్డాడతడు.

“అయిందా శాస్త్రి” అన్న కేకలు దూరదూరంగా వినిపిస్తున్నా యతనికి, “పిచ్చిదేమిటి చెప్మా” అనుకున్నాడు. భయమేసింది. హడిలిపోయి, ముసుగుతన్ని పడుకున్నాడు ఆవీరుడు.

పరుగెత్తి, పరుగెత్తి, ఆమె ఒక చిన్నగుడిశె ముందు ఆగింది. ఒకసారి యిటూ, అటూచూసి లోపలికి దూరింది.

గుమ్మం పక్కనే కుండ పెంకులో గుడ్డవత్తి వెలుగుతూంది. లోపల చాపమీద అయిదారేళ్ళ కుర్రాడు ఆకలితో కడుపు దించుకుపోయి, దీనంగాచూస్తున్నాడు.

తల్లి రాగానే, “అమ్మా, అన్నంతెచ్చావా” అన్నాడు, ఆశతో లేవబోతూ, సమాధానంగా, పెద్ద నవ్వునవ్వింది. కుర్రవాడు హడిలిపోయి, బావురుమన్నాడు. చాప లాగి వాడిమీదేసికొట్టింది? ఆగాలికి ఆకాస్త దీపం కొండెక్కింది. కుర్రాడు పెద్దగా ఏడుస్తూంటే “అయిందా శాస్త్రి” అంటూ బయటికొచ్చింది.

ఆ చీకటిలో—‘కోసినా తెగిపోని ఒత్తయిన చీకటి’లో—ఎక్కడికో. ఆ ప్రయాణం;

ఊరి పొలిమేరలో ఒకపెద్ద చింతచెట్టుంది. ఎక్కడలేని దెయ్యాలూ, భూతాలూ, ఆచెట్టుని ఆవరించుకుని వున్నాయని ఊరంతాప్రతీతి. పగలుకూడా ఆ ప్రాంతానికి రావడానికి అందరికీ భయం. ఆమెకూడా అదివరకు ‘దెయ్యాల చింత’ పేరు జ్ఞాపకంవొస్తేనే ఉలిక్కిపడేది.—అట్లాంటిది, ఆరాత్రి అంతా, ఆ దెయ్యాలచింతక్రిందే. ఒంటరిగా గడిపింది, మధ్యమధ్య “అయిందా శాస్త్రి” అని పెద్దపెద్ద కేకవేసుకుంటూ ప్రాంత వృక్షాలమీదవుండే పక్షుల్నికూడా తరిమేసింది తనకి సాయమేనా వుండకుండా. పిచ్చిదానికి సాయమెందుకు! దేముడూ. నై! దెయ్యమూనై!!

తెల్లారింది. ఊళ్ళోంచి ఒక ఆబోతు రంకెలు వేసుకుంటూ రావడంచూసింది. వెంటనే దాన్ని పట్టుకొనేదానిలా, దారికడ్డంగా నుంచుంది. ధైర్యంగా చేతులు పక్కకుచూచి, దానంతట ఆదే పక్కకుతొలగి పారిపోయింది ఆ ఆబోతు, “అయిందా శాస్త్రి” అని అట్టహాసంచేస్తూ ఊళ్ళోకి పారిపోయింది, ఆ ఉన్మాదిని.

ఊళ్ళో దేముడుఊరేగుతున్నాడు. నెమ్మదిగా ఏమీ ఎరగనట్లు పల్లకీదగ్గరకెళ్ళింది. అలా కాసేపుచూచినట్లే చూసి, దానిలోని విగ్రహాన్ని ఊడబెరికి దూరంగా విసిరేసి పరుగుచ్చుకుంది

“అయిందా శాస్త్రి” అంటూ....

ఆ పరుగు పరుగు—తిన్నగా పడపల కాలవ వంతెనదాకా ఆదే పరుగు. వంతెన మీద ఆగింది. ఊచలు పట్టుకునివంగి, వంతెన కిందకు తొంగి చూచింది.

వంతెనకింద చప్టామీద నుంచుని—స్నానం చేసి ఒళ్ళు తుడుచుకుంటున్నాడు నిన్నటి యువకుడు—అతనిని బాగా పరకాయించింది. అవతల ప్రక్కనుంచి వంతెనదిగి నెమ్మదిగా అతని వెనుక వైపునకువచ్చింది. అతను కూర్చుని తడిబట్ట గుంజుతున్నాడు.

నలువైపులా పరిశీలించింది. ఒక పెద్దరాయి రెండు చేతులతో మోసుకొచ్చి అతని వెనకాల నిలబడింది. అప్రయత్నంగా అతనొకసారి తలెత్తి వెనక్కిచూచేడు. హడిలిపోయి ఉలిక్కిపడ్డాడు.—అంతే—

....ఆరాతిని అమాంతంగా అతని నెత్తిమీద యెత్తేసింది. ‘ఠణేల్’ శబ్దం ప్రతిధ్వనించింది.

రక్తంలో తేలుతూన్న ఆ కళేబరాన్ని తృ కాలితో కాలవలోకి నెట్టేసింది. ఒక్కసారి బుడుంగున మునిగి తేలిపోయింది, అమృతదేహం.

వంతెనవణికి పోయేటట్టుగా, “అయిందా శాస్త్రి” అని వికటాట్టహాసంచేసింది విరగబడి నవ్వుతూ.